# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

MARCH 2007

సంవత్సర చందా రూ. 50/-

సత్యవాణి ఇప్పుడు 'విస్పా' ఛానెల్ లో కూడ

ప్రతి గురువారం ఉదయం 7:00 గం॥

నుండి 7:30 గం॥ల వరకు చూడండి.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

| | | |
|---|---|---|
| ప్రతి మంగళవారం | : | ఉదయం 6:30 గం॥లకు 'మా' టి.వి. లోను |
| ప్రతి గురువారం | : | 'విస్పా' ఛానల్ లో ఉదయం 7:00 గం॥లకు |
| ప్రతి శుక్రవారం | : | KTV లోను, IN లో ఉదయం 7:00గం॥లకు,సాయంత్రం 5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే) |
| ప్రతి శనివారం | : | ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి |
| ప్రసంగీకులు | : | బ్రదర్. జాషువా గూటం<br>బ్రదర్. రిక్కీ గూటం |

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 27 | మార్చి 2007 | సంచిక 8


## బైబిలు సూచించు దేవుడు
## (The God of the Bible)

నిజముగా దేవుడున్నాడా? అయితే ఆయన ఎట్లుంటాడు? మానవుడెవరు? అతడు ఈ భూమి మీదకు ఎట్లు వచ్చాడు? అను ప్రశ్నలకు జవాబునిచ్చుటకు అనేకమంది వేదాంత వేత్తలు ప్రయత్నించారు. మానవుడు తన జ్ఞానమును బట్టి దేవుని కనుగొనుటకును, అతని అంతరంగమందున్న ప్రశ్నలకు జవాబుల నిచ్చుటకును పూనుకొనిసందున ప్రపంచందనేక మతములు ఈనాడున్నవి.

అయితే బైబిలు వీటన్నిటికిని జవాబు నిచ్చుచున్నది. అది ఇట్లు చెప్పుచున్నది. "జ్ఞాని యేమయ్యెను? శాస్త్రి యేమయ్యెను? ఈ లోకపు తర్కవాది యేమయ్యెను? ఈలోక జ్ఞానమును దేవుడు వెర్రితనముగా చేసియున్నాడు గదా? దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగకుండినందున, సువార్త ప్రకటనయను వెర్రితనము చేత నమ్మువారిని రక్షించుట దేవుని

దయాపూర్వక సంకల్పమాయెను" (1 కొరింథి 1:20-21).

దేవుడు మనుష్యుని తన స్వరూపమందు, తన పోలిక చొప్పున చేసెను (ఆదికాండము 1:26-28). దేవుని సేవించుట కొరకును, మహిమ పరచుట కొరకును అతడు చేయబడెను. (1 కొరింథి 10:31, ప్రసంగి 12:13,14). అయితే మానవుడు పాపము చేయుటవలన భూమిపై అతని దినములు బహు తక్కువైపోయినవి. భక్తుడైన యాకోబు ఇట్లు వ్రాసెను: "మీ జీవమేపాటిది? మీరు కొంతసేపు కనబడి అంతలో మాయమైపోవు అవిరివంటివారే" (యాకోబు 4:14). మనుష్యుడు చనిపోయిన తరువాత "మన్నయినది వెనకటివలెనే మరల భూమికి చేరును. ఆత్మ దానిని దయచేసిన దేవునియొద్దకు మరల పోవును'' (ప్రసంగి 12:7). అందువలన భూమిమీద మనకీయ బడిన ఈ జీవితములోనే మనము రాబోవు నిత్యజీవితము కొరకు సిద్ధపడవలెను. మనుష్యులందరు నిజదేవుని తెలిసికొనవలెనని ఆయన కోరుచున్నాడు. "ఊరకుండుడి, నేనే దేవుడనని తెలిసికొనుడి. అన్యజనులలో నేను మహోన్నతుడగుదును" అని ఆయన సెలవిచ్చుచున్నాడు (కీర్తనలు 46:10). "అద్వితీయ సత్య దేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసు క్రీస్తును ఎరుగుటయే నిత్యజీవము'' అని యేసుప్రభువు పలికెను (యోహాను 17:3). గనుక మనము ఆ నిత్యసత్య దేవుని తెలిసికొనుట యెంతయో అవసరము.

దేవుని లక్షణములను బట్టి మనము ఆయనను తెలిసికొనగలము: మొదటిగా: **దేవుడు ఆత్మయై యున్నాడు.** "దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను, సత్యము తోను ఆరాధింప వలెను" అని యేసు చెప్పెను (యోహాను 4:24). దేవుడు ఆత్మయై యున్నాడు అనగా ఆయన పదార్థము కాదు అని గ్రహించవలెను. ఆయన మన వలె భౌతికకాయుడు కాదు. "రక్తమాంస ములు దేవుని రాజ్యమును స్వతంత్రించు కొననేరవు. క్షయత అక్షయతను స్వతంత్రించుకొనదు" (1 కొరింథి 15:50). ఆత్మయైన దేవుడు ఎట్లుండునో ఎవరును ఎరుగరు. ఆయన అదృశ్యుడు. సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వసించుచు అమరత్వము గలవాడై యున్నాడు. మనుష్యులలో

ఎవడును ఆయనను చూడలేదు. ఎవడును చూడనేరడు (కొలస్స 1:15;1 తిమోతి 6:16). అయితే మనము ఆయనను తెలిసికొనులాగున, మానవ పదజాలములతో ఆయన లక్షణములు మనకు వర్ణించబడినవి. ఉదాహరణకు యెషయా ఇట్లు వ్రాసెను: "యెహోవా ఈలాగు ఆజ్ఞ ఇచ్చుచున్నాడు, ఆకాశము నా సింహాసనము, భూమి నా పాద పీఠము" (యెషయా 66:1). అయితే సొలోమోను మహారాజు ఇట్లనుచున్నాడు: "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు; ఆకాశ మహాకాశములు సహితము నిన్ను పట్టజాలవు; నేను కట్టించిన మందిరము ఏలాగు పట్టును?" (1రాజులు 8:27).

దేవుడు పదార్థము కాదు అని గ్రహించిన తరువాత, దేవుడు జీవముగల దేవుడు అని మనము తెలిసికొనవలెను. "యెహోవాయే నిజమైన దేవుడు; ఆయనే జీవముగల దేవుడు" (యిర్మియా 10:10). ఆయన వ్యక్తిత్వము గల దేవుడు. పదార్థము కంటే ఆత్మ (Spirit) గొప్పది. ఆత్మ పదార్థమును సృజించెను గాని పదార్థము ఆత్మను సృజింపలేదు. దేవుడు మానవుని కంటె గొప్పవాడు గనుక ఆయన ఆరాధనీయుడు, పూజింప తగినవాడు.

**దేవుడు అనంతమైన ఆత్మయై యున్నాడు.** అనగా ఆయన అంతు లేనివాడు. ఆయన మహోత్మ్యము గ్రహింప శక్యము కానిది. అపొస్తలుడైన పౌలు ఇట్లు చెప్పుచున్నాడు. "అహా! దేవుని బుద్ధి జ్ఞానముల బాహుళ్యము ఎంతో గంభీరములు; ఆయన మార్గములెంతో అగమ్యములు; ఆయన తీర్పులు శోధింప నెంతో అశక్యములు" (రోమా 11:33). ఈ విశ్వమంతయును అమితమైన దేవుని యొక్క మితమైన భావము మాత్రమే. అనంతము ఒకే ఒక్క మూర్తికి చెందును. మితములైన అనేక సంగతులతో అనంతము కూడి యుండలేదు. అయితే దేవుడే తన్ను తాను మితము చేసికొనినట్లు మన కనేకసారులు కన్పడుచున్నది.

దేవుడు అనంతమై యున్నాడనగా అర్థమేమియని మీరడుగ వచ్చును. ఆయన తనకుగా తాను ఉన్నవాడు ఆయన నిత్యము ఉన్నవాడైనవాడు. "నేను ఉన్నవాడను అనువాడనై

యున్నవానిననై" అని మోషేకు చెప్పెను. అనంతమైనవాడనగా ఆయన మార్పు జెందనివాడు - నిన్న, నేడు, నిరంతరము ఏకరీతిగా యుండువాడు.

అనంతము అనగా ఏకత్వమును, పరిపూర్ణతను, విభజన లేనిదానిని, సంపూర్ణతను సూచించుచున్నది. దేవుడు అనంతమైనవాడు గనుక ఆ యనంత ములో వేరే దేవుండ్లకు చోటులేదు. "సైన్యములకు అధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు - నేను మొదటివాడను, కడపటివాడను, నేను తప్ప ఏ దేవుడును లేడు" (యెషయా 44:6).

**దేవుడు పరిపూర్ణ ఆత్మయై యున్నాడు.** దేవుడు యథార్థవంతుడు. యెహోవా వాక్కు నిర్మలము. ఆయనలో లేమియైనది ఏమియును లేదు. అందువలన ఆయన అభివృద్ధిచేయబడ నవుసరము లేదు. దేవుడు సత్యమై యున్నాడు. ఆయన ఒక్కడే నిజదేవుడు. ఆయన ఎల్లప్పుడు సత్యమును పలుకును. ఆయన పరిపూర్ణ జ్ఞానవంతుడు. ఆయనే సత్యము, సత్యము నంతటికిని ఆయన ఆధారభూతుడు, ఆయనే దేవుడు.

దేవుడు ప్రేమయై యున్నాడు గనుక ఆయన తన ప్రేమను వెల్లడి చేయును. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను. కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16). "మనము దేవుని ప్రేమించితిమని కాదు, తానే మనలను ప్రేమించి, మన పాపముల ప్రాయశ్చిత్తమై యుండుటకు తన కుమారుని పంపెను. ఇందులో ప్రేమ యున్నది" (1 యోహాను 4:10). ఆయన ప్రేమ భావ ప్రేరితమైనది కాదు గాని, న్యాయమైనది. ఆయన ప్రేమ జ్ఞానయుక్తమైనది. స్వేచ్ఛా పూర్వకమై నది. అది పరిపూర్ణ యథార్థత గలిగినది. పరిశుద్ధతను బట్టి నడిపింపబడునది దేవుని ప్రేమ. ఆయన నీతిని ప్రేమించి భక్తిహీనతను ద్వేషించువాడు, ప్రేమవలన ఆయన మనకొరకు బాధలను సహించును.

**దేవుడు పరిశుద్ధుడు.** ఆయన భావపూరితుడు, పరిశుద్ధతను వెల్లడిజేయువాడు. ఆయన పరిశుద్ధుడు గనుక మానవులు కూడ పరిశుద్ధులు కావలెనని ఆయన కోరుచున్నాడు. "నేను పరిశుద్ధుడనైయున్నాను గనుక మీరును

పరిశుద్ధులై యుండుడియని వ్రాయబడి యున్నది" (1 పేతురు 1:14).

**దేవుడు నమ్మతగినవాడు**. ఆయన సత్యవంతుడు గనుక ఆయన యిచ్చిన బయలుపాటు (సాక్ష్యము) అంతయును నమ్మతగినది. ఆయన సత్యము తరతరములుండును. ఆయన ఎంతైన నమ్మతగినవాడు. ఆయన వాగ్దానములను నెరవేర్చువాడు. అందువలననే అన్ని విషయములలోను మానవుడు దేవుని పోలి నడుచుకొనవలెనని ఆయన కోరుచున్నాడు.

**దేవుడు కృప గల దేవుడు.** అందువలన ఆయన మానవుని యొుక్క తాత్కాలిక క్షేమము, నిత్యజీవిత సుఖము కోరుచున్నాడు. ఆయన చెడ్డవారి మీదను, మంచివారి మీదను తన సూర్యుని ఉదయింపజేసి నీతిమంతుల మీదను, అనీతిమంతుల మీదను వర్షము కురిపించుచున్నాడు. ఇట్లు ఆయన అందరి యెడల తన కృపను కనబరచుచున్నాడు. మరియు ఆయన తనకు విధేయులైన వారి యెడల ప్రత్యేకమైన కృపను చూపుటకు సిద్ధముగా యున్నాడు. "నమ్మి బాప్తిస్మము పొందిన వానిని ఆయన రక్షించును". మన పాపములు మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మతగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములు క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:9). దేవుడు కృపగలిగినవాడు గనుక మానవుడు కూడ కృప గలిగి యుండవలెను.

**దేవుడు న్యాయవంతుడు**. దేవుని కార్యములన్నియు సంపూర్ణములు. ఆయన చర్యలన్నియు న్యాయములు. ఆయన నీతిపరుడు, యథార్థవంతుడు. ఆయన యథార్థత పాపమునంతటిని ద్వేషించుచున్నది. అందువలన ఆయన పాపమును శిక్షింపవలెను లేదా ఆయన న్యాయమును బట్టి పాపిని క్షమించు విధానమును నెలకొల్పవలెను. "ఏ భేదమును లేదు, అందరును పాపము చేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తు యేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడు చున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని

కనబరచవలెనని, క్రీస్తు యేసునందలి విశ్వాసముద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. దేవుడిప్పటి కాలమందు తన నీతిని కనబరచు నిమిత్తము, తాను నీతిమంతుడును, యేసు నందు విశ్వాసము గల వానిని నీతిమంతుడుగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగు చేసెను" (రోమా 3:23-26). దేవుడు శిక్షించునపుడు పగ తీర్చుకొనుటకుకాదు గాని, న్యాయము సాధించు నిమిత్తము శిక్షించును. దేవుడు ప్రేమించి, ద్వేషించువాడై యున్నాడు. మానవునికి కూడ అట్టి సమస్యలు అనేకములున్నవి.

దేవుని న్యాయకోపమునుండి మానవుడు తప్పించుకొనవలెనంటే, యేసుక్రీస్తు తప్ప వేరొకడు లేడు. ఆయన ఇట్లు చెప్పుచున్నాడు: "దుష్టులు మరణము నొందుటచేత నాకు ఏమాత్రమైన సంతోషము కలుగునా? వారు తమ ప్రవర్తనను దిద్దుకొని బ్రతుకుటయే నాకు సంతోషము. ఇదే యెహోవా వాక్కు" (యెహెజ్కేలు 18:23). "మరణము నొందువాడు మరణము నొందుటను బట్టి నేను సంతోషించువాడను కాను. కావున మీరు మనస్సు త్రిప్పుకొనుడి. అప్పుడు మీరు బ్రతుకుదురు. ఇదే ప్రభువగు యెహోవా వాక్కు (యెహెజ్కేలు 18:32).

ఇంత గంభీరమైన దేవుని బయలు పరచుచు యేసు ప్రభువు మన మధ్యను జీవించెను. నేను ఆయనను అని మీరు నమ్మని యెడల మీరు మీపాపములోనే మరణింతురని యేసు చెప్పెను. మీరు మారుమనస్సు నొందని యెడల మీరందరు అలాగే నశింతురు అని ఆయన చెప్పెను. గనుక నేడు మానవులు దేవుని ఉగ్రత నుండి తప్పించుకొనవలెననిన, వారు మారుమనస్సు నొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందవలెను. అప్పుడు పరిశుద్ధాత్మయను వరమును వారు పొందుదురు. నీవు యేసుక్రీస్తు నందు విశ్వాసివా? అయితే ఆయన ఆజ్ఞలకు ఈనాడే లోబడవలెనని నిన్ను హెచ్చరించుచున్నాను.

– జాషువా గూటం

## సంఘము యొక్క పని

(Work of the Church)

సంఘము ఎందుకు ఉన్నది? దాని ప్రయోజన మేమి? దాని పనియేమి? వాటిని తెలిసికొనుటకు మనము దేవుని వాక్యము నొద్దకు వెళ్లుదము.

సంఘము ఈ లోకసంబంధమైన వ్యాపారములో లేదు అని గమనించ వలెను. పాఠశాలలను, అసుపత్రులను నడిపించుట దాని పనికాదు. ధనార్జన కొరకు గ్రంథములను ప్రచురించి విక్రయించు వ్యాపారము నందు అదిలేదు. ఈ పనులన్నియును మంచివే. క్రైస్తవులు వ్యక్తిగతముగా వీటిని జరిగించు హక్కు కలిగినవారయినను, అవి మాత్రము సంఘము యొక్క పని కాదు. ఈనాటి క్రైస్తవలోకము పైనుదహరింపబడిన పనులపై ఎక్కువ కేంద్రీకృతమై దేవుని నుండియు బైబిలు నుండియు, ఆయన కార్యక్రమము నుండియు మరింత దూరమైపోయినది.

మనము దైవగ్రంథపు పుటలను తిరుగవేసిన యెడల సంఘము యొక్క పని మూడు విధములుగ నున్నదని గమనించగలము: సువార్తను ప్రకటించుట, అపదలలో నున్నవారిని ఆదుకొనుట, సంఘక్షేమాభివృద్ధి కలుగజేయుట. వీటిని ఒక్కొక్క దానిని ఇప్పుడు గమనించుదము:

**1. సువార్తను ప్రకటించుట**: క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచి పరలోకమున కెక్కిపోక ముందు తన శిష్యులకిట్లు బోధించెను: "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులుగా చేయుడి: తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను'' (మత్తయి 28:19,20). ''మరియు మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింప బడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:15,16). తరువాత యౌవన బోధకుడైన తిమోతిని పౌలు ఇట్లు హెచ్చరించెను: "వాక్యమును

ప్రకటించుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణ దీర్ఘశాంతముతో ఉపదేశించుచు ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము" (2 తిమో 4:2). ఇంకను అట్టి అనేక వచనములను మనము చూడవచ్చును గాని ఈ పైన చెప్పబడిన వచనముల ద్వారా సువార్త ప్రకటన జరుగవలెననెడి దేవుని అభిలాష మనకు తప్పక వ్యక్తమగుచున్నది.

అపొస్తలుల కాలములో సంఘము ఏమి చేసెను? ప్రభువు వారిని ఏమి చేయవలెనని కోరెనో దానినే సంఘ సభ్యులు చేసిరి. వారు వాక్యమును ప్రకటించిరి. అపొస్తలులు కార్యములు అను పుస్తకము ఈ ఉదాహరణలతో నిండి యున్నది. వాక్యమును బోధించుట ద్వారా జనులు మార్పుచెందిన సందర్భములందున్నవి. అపొస్తలుల కార్యములలో 2,8,9,10,16వ అధ్యాయయములను చదువుము. వాక్యమును ఎవరు ప్రకటించి బోధించిరి? యెరూషలేములోని సంఘమునకు గొప్ప హింస కలిగిన తరువాత "చెదరిపోయినవారు సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసిరి" యని బైబిలు చెప్పుచున్నది (అపొ.కా. 8:4).

వారు ఏమి బోధించిరి? ఇది తెలిసికొనవలెననిన అపొస్తలుల కార్యముల గ్రంధములో మార్పు చెందినవారి సంగతని చదివిన చాలును. అయితే క్లుప్తముగా, వారు క్రీస్తు యొక్క దైవత్వమును బోధించిరి, రక్షణ మార్గమును, సంఘ ప్రాముఖ్యతను, ఆరాధనాంశములను, క్రైస్తవ జీవిత ప్రాముఖ్యతను మొదలగు వాటిని బోధించిరి. దానినంతటిని పౌలు సంక్షిప్తముగ ఇట్లు నుడివెను: "సిలువను గూర్చిన వార్త నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (1 కొరింధి 1:18).

తన వాక్యము ప్రకటింపబడవలెనని ప్రభువు ఆజ్ఞాపించుటయే గాక, దేవుని వాక్యమును వినుట ద్వారా విశ్వాసము కలుగునని పౌలు చెప్పుచున్నాడు (రోమా 10:17). ''మీరు సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులుగా చేయునని" యేసు చెప్పెను (యోహాను 8:32). మరల "వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్ధన చేయుదురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించువాడు లేకుండా వారెట్లు విందురు?" (రోమా

10:14). దీని యంతటి భావమేనగా- మానవుడు నశించిపోవుచున్నాడు (రోమా 3:23;6:23). గనుక దేవుని ప్రేమ ప్రకటింపబడవలెను (యోహాను 3:16). మరియు దేవునికి విధేయత చూపుట ద్వారా మానవుడు పాపముల నుండి రక్షింపబడగలడు (రోమా 1:16,17;మార్కు 16:15,16). దేవుని చిత్తము నెవరు ఎరుగరో, ఆయనకు ఎవరు లోబడరో వారందరు నశింతురు (2 థెస్స 1:7-9). అందువలన దేవుని వాక్యము ప్రకటింపబడవలెను.

**2. బీదలకు సహాయము చేయుట:** ఆపదలలోనున్న వారి యెడల సంఘము ఆసక్తి కలిగియుండెనని, అట్టివారికి శక్తికొలది సహాయము చేయుట జరిగెనని మనము దేవుని గ్రంధమందు చూడగలము. అపో.కా. 2:45 ఇట్లు చెప్పుచున్నది: "ఇదియు గాక వారు తమ చరస్థిరాస్థులను అమ్మి, అందరికి వారివారి అక్కరకొలది పంచిపెట్టిరి". ఇది హృదయపూర్వకముగా చేయబడినది. అయితే అపో.కా. 6వ అధ్యాయములో, అనుదినపరిచర్యలో తమలోని విధవరాండ్రను చిన్నచూపు చూచిరని హెబ్రీయుల మీద గ్రీకు భాష మాట్లాడు యూదులు సణుగసాగినట్లు కన్పడుచున్నది. గనుక అపొస్తలులు శిష్యుల సమూహమును పిలిచి సంఘములో ఈ ప్రత్యేక పనికి నియమింపబడు నిమిత్తము యేడుగురు మనుష్యులను ఏర్పరచిరి.

యెరూషలేములోనున్న పేద పరిశుద్ధుల పరిచర్యకు పౌలు వెళ్ళినట్లు మనము చదువగలము. "అయితే ఇప్పుడు పరిశుద్ధుల కొరకు పరిచర్య చేయుచు యెరుషలేము వెళ్లుచున్నాను. ఏలయనగా యెరుషలేములో ఉన్న పరిశుద్ధులలో బీదలైన వారి నిమిత్తము మాసిదోనియవారును, అకయవారును కొంత సొమ్ము చందావేయనిష్టపడిరి" (రోమా15:25,26) అని పౌలు వ్రాసెను. కొరింధులో యున్న సహోదరులకు పౌలు ఇట్లు వ్రాసెను: "పరిశుద్ధులకొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందా పోగుచేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తనయొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1 కొరింధి 16:1,2).

ఎవరికి సహాయము చేయవలెను?

మొదటిగా సంఘమందు ఆపదలోనున్న వారికి అనగా బీదలు, వృద్ధులు, విధవరాండ్రు, క్రైస్తవ అనాధులు, ప్రమాదములలో చిక్కుకొనిని వారు మొదలగువారు. "కాబట్టి మనకు సమయము దొరికినకొలది అందరి యెడలను, విశేషముగా విశ్వాస గృహమునకు చేరినవారి యెడలను మేలు చేయుదము" (గలతీ 6:10). ఎవరికిబడితే వారికి సహాయము చేయుటయని కాదు. 1 తిమోతి 5వ అధ్యాయములో మనము చూచిన యెడల నిస్సహాయులకు, ఆదుకొన బంధువులు లేనివారికి, నమ్మకమైన క్రైస్తవులని నిరూపించుకొనిన నిరాధారులకు సహాయము చేయవలెనని గమించగలము. గనుక దేవుని ధనమును జాగ్రత్తగ వినియోగించ వలెను, అడిగిన కందరికి పంచిపెట్టుట జరుగకూడదు.

సహాయము సంఘసభ్యులకు మాత్రమే కాకుండా, సంఘస్తోమతను బట్టి ఆపదలో నున్నవారికందరికి అందజేయవలెను. యాకోబు 1:27ను, యాకోబు 2వ అధ్యాయమును చదువుము. ప్రజలకు సువార్తను అందజేయు మార్గము ఇది ఒకటి.

ఇట్టి పనిని చేయుటకు ధనము ఎక్కడ నుండి వచ్చును? ప్రోత్సాహము కలిగి కానుకల నిచ్చు సభ్యుల నుండి వచ్చును (1 కొరింధి 16:1,2;2 కొరింధి 9:6,7). అంటే క్రైస్తవులు కానుకల నియ్యనియెడల ఆపదలో నున్నవారికి సహాయము చేయుటకు సంఘమునకు అవకాశముండదు.

**3. సంఘక్షేమాభివృద్ధి కలుగ జేయుట:** క్షేమాభివృద్ధి యనగా సంఘమును సమకూర్చుట, పటిష్టము చేయుట, ప్రోత్సహించుట, సభ్యులలో ఆత్మీయోద్రేకమును కలుగుజేయుట, క్షేమాభివృద్ధిని కలుగజేయునవేమి? దేవుని వాక్యము, సహవాసము, ఆరాధన, పరస్పర సహాయము, సత్క్రియలు, ప్రేమ మొదలగునవి. అపొ.కా. 9:31; రోమా 14:19; 1కొరింధి 8:1; 1 థెస్స 5:11; 1 కొరింధి 14:26; 2 కొరింధి 12:19; ఎఫెసీ 4:12లను చదువుము.

ఈ పనులన్నిటిని సంఘము ఖండాంతర అర్గనైజేషన్ లేకుండను, ఒక మానవాధికారి లేకుండగను, ధనమును ప్రత్యేకముగ పోగుచేయకుండగను ఎట్లు జరిగించగలదు అని అనేకులు ఆశ్చర్యపడుదురు. అయితే ప్రభువు

మార్గమే సరియైన మార్గము. ఆయన పనిచేయు మార్గము అది ఒక్కటే. మనము దేవుని చిత్తమును నెరవేర్చుచు, తద్వారా ఈ భూమిపై మన ఉనికిని నిర్వర్తించుచున్న యెడల స్తుతి, మహిమ, ఘనతలు దేవునికి చెల్లును. క్రీస్తే సంఘమునకు శిరస్సై యున్నాడు. ప్రతి స్థానిక సంఘము, ప్రతి సభ్యుడు వారి వారి బాధ్యతలను నెరవేర్చవలెను. సంఘ సభ్యులు వర్ధిల్లినకొలది, దేవునికి ఇచ్చుట ద్వారానే సంఘము తన పనిని నిర్వర్తించుటకవకాశము దొరుకును.

సువార్త ప్రకటించుట, నిస్సహాయులకు సహాయము చేయుట క్షేమాభివృద్ధి కలుగజేయుట యనునవన్నియును మానవుల ఆత్మలను రక్షించుట కొరకు ఉద్దేశించబడిన పనులు మాత్రమే. వాటిద్వారా దేవుడే స్తుతింపబడును. సంఘమునకు ఇదిగాక వేరొకపని ఏదియును లేదు. రాజకీయములు, వ్యాపారము మొదలగునవి సంఘమును ఒక సాంఘిక సంస్థగా మాత్రమే తయారు చేయును. అవి దేవుని యొద్దనుండి కలిగినవి కావు. క్రీస్తుసంఘము ఒక ఆత్మీయ సంస్థయై యున్నది. అది లోకములో యున్నది కాని లోకసంబంధమైనది కాదు. దేవునికి లోబడుచు మానవసేవ చేయుచు, సభ్యులందరి ఆత్మల రక్షణార్ధము, పవిత్రముగను, పరిశుద్ధముగను ఉండి దాని సృష్టికర్తకు మహిమను తెచ్చుటయే దాని బాధ్యత. ఇదియే క్రీస్తు సంఘము, ఇదియే దాని కృషి. ఇదియే దాని కర్తవ్యము.

– జె. సి. ఛోట్

**సత్యవాణి – క్రీస్తు సంఘము ద్వారా ఉచితంగా ఇయ్యబడుచున్న బైబిలు కరస్పాండెన్సు కోర్సులో మీరు, మీ సంఘ సభ్యులు చేరండి. ఆ పాఠములను మీయింటిలోనే పూర్తిచేసి తెలుగు బైబిలును ఉచితముగా పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి.**

SATYAVANI, P.O.Box-80 KAKINADA - 533 001.

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

# దేవునికి అసహ్యము కలుగజేసిన సంఘము - లవొదికయ

## (The Church that made God Sick - Laodicea)

**పరిచయం:** అంతియొకస్ II అనువాడు లవొదికయ పట్టణమును స్థాపించెను. లవొదీస్ అను అతని భార్యను బట్టి ఆ పట్టణము లవొదికయ యని పిలువ బడెను.

1. అది సంపన్న పట్టణం. కోటీశ్వర్లు అనేకులు అందుండేవారు. క్రీ॥శ 60 లో గొప్ప భూకంపము వలన ఆ పట్టణం నేలకూలెను. సార్దీస్, ఫిలదెల్ఫియల వలె తిరిగి కట్టబడడానికి దానికి యితరుల సహాయం అక్కరలేకపోయెను.

2. అది దుస్తుల తయారీ కేంద్రము. ముఖ్యంగా నల్ల, కాకి రంగులలో యుండే ఉన్ని దుస్తులు అక్కడ తయారయ్యేవి.

3. ఈ పట్టణంలో ఒక వైద్యపాఠశాల యుండేది. అది కాటుకకును, చెవి మందుకును ప్రసిద్ధి. ఆరోగ్య సంబంధ మైన జలధారలు ఆ పట్టణంలో ఉండేవి.

4. కొలస్సయులకు వ్రాయబడిన పత్రికలో లవొదికయను గూర్చి రెండు మార్లు చెప్పబడెను (కొలస్స 2:1;4:16).

5. క్రీస్తు 7 సంఘములకు వ్రాసిన పత్రికలలో యిది చాల విచారకరమైన పత్రిక, దానిలో అభినందన యేమీ లేదు. మృతసంఘము యొక్క శవపరీక్ష అది. క్రీస్తు ఆ సంఘాన్ని విశ్లేషిస్తూ దేని వలన అది మృతమాయెనో తెలియ జేయుచున్నారు.

**I. చివరి లేఖ యొక్క లేఖరి (14వ)**

A. క్రీస్తు తన్నుతాను ఆమేన్ అనువాడనని చెప్పుకొన్నారు. దీనిని 'నిశ్చయముగా' 'నిజముగా' అని అనువాదం చేయడం జరిగింది. అంటే ఆయన చెప్పుచున్నది యదార్థం అని వక్కాణించుటకు అట్లు చెప్పబడింది. ఆయన నమ్మదగిన దేవుడు (యెషయా 65:16).

B. క్రీస్తు ఆమేన్ అనువాడు ఏలయనగా ఆయన నమ్మకమైన సత్యసాక్షి, చూచిన వాడు వినినవాడు సాక్షి. క్రీస్తు నమ్మదగిన సాక్షి.

C. ఆయన దేవుని సృష్టికి ఆది యైనవాడు. దేవుడు క్రీస్తును మొదట సృజించెనని యెహోవా సాక్షులు చెబుతారు. అది అబద్ధం. క్రీస్తు సమస్త సృష్టికి ఆధారభూతుడని,

సృష్టి అంతయు ఆయన నుండే కలిగెనని దీనియర్థం.

1. యోహాను 1:13-14 శరీరము ధరించిన వాక్యమైన దేవుడు మన మధ్య నివసించెనని, ఆయనే సమస్తము సృజించెనని చెప్పుచున్నది.

2. కొలస్స 1:16, "సర్వము ఆయన యందు సృజింపబడెను; సమస్తమును ఆయన ద్వారాను, ఆయనను బట్టియు సృజింపబడెను" అని చెప్పుచున్నది.

**II. అభిశంస (15-17వ).**

A. లవొదికయ సంఘమును గూర్చిన అభినందన యేమిలేదు. అది అన్నిటికంటే బాగా పాడైపోయిన సంఘము. తుయతైరలో కనీసం కొందరైనా ఉన్నారు. సార్దీస్‌లో తమ వస్త్రములను మలినము చేసుకొనని కొందరైనా వున్నారు.

B. క్రీస్తు వారి క్రియలనెరుగును.

1. వారు వెచ్చగానైనా లేరు, లవొదికయలో వేడినీళ్ల ఊటలు వుండేవి. వెచ్చగా అంటే Zestos అని ఆదిమ భాషలో మరుగుచున్నంత వేడి అని అర్థం.

2. వారు చల్లగానైనా లేరు, కొలస్సయలో చల్లటి నీటి ఊట లుండేవి. ఈ వూటలను మనస్సునందుంచుకొని యేసు వారినుద్దేశించి అట్లు చెప్పెను.

3. వారు వెచ్చగానైనను, చల్లగానైనను లేనేలేరు. వారిలో సహజమైన ఉత్సాహముగాని, చల్లగానున్న ప్రతిపక్షముగాని వారికి లేదు.

C. "నీవు చల్లగానైనను వెచ్చగానైనను ఉండిన మేలు" అని క్రీస్తు చెప్పెను. వారు నిజంగా రక్షింపబడైనా లేక నశించిపోయి యుండినా మేలని ఆయన తలంచారు.

D. ఆయన శిష్యులు పౌరుషముగలిగి యుండాలని ఆయన కోరారు. వారి జీవితాల్లో ప్రధమ స్థానం క్రీస్తుకు ఆయన సంఘానికి ఇయ్యాలి. తటస్థ స్థితికి తావేమిలేదు. ఆయనతో లేనివాడు అపవాదితోయున్నవాడే (మత్త 12:30).

E. లవొదికయలో సంఘము చల్లగానైనను, వెచ్చగానైనను లేదు. వారు నులివెచ్చగా యుండిరి. నులివెచ్చన అనే మాటను వారెరు గుదురు. లవొదికయలోని జలధారలు నులివెచ్చగా యుండేవి.

1. లవొదికయలో క్రైస్తవులు దేవుని

నెరిగిన వారమని చెప్పుకొనేవారు గాని వారి క్రియలు దానికి భిన్నముగా యుండేవి (తీతు 1:16). వారు పైకి భక్తిగలవారై యుండియు దాని శక్తిని ఆశ్రయించనివారు (2 తిమో 3:5).

2. వారు హితబోధనెరుగుదురు గాని దానిని పరిరక్షించరు.

3. సిలువను ఎరుగననరు, అయినా ఉదాసీనత గలవారు.

4. వారి జీవితాల్లో పాపమును ఏలనిచ్చారు.

5. ఈలోకం నశించిపోతున్నదని ఎరుగుదురు, గాని దానిని గూర్చి యేమీ చేయడం లేదు.

6. నులి వెచ్చని స్థితిలో యుండి మంచిచెడుల మధ్య తారతమ్యాన్ని వారు కోల్పోయారు.

F. లవొదికయ వారు నులివెచ్చగా యుండాలని ప్రభువు కోరలేదు. గర్జించు సింహము (అపవాది) యెదుట నులివెచ్చని క్రైస్తవులు ఎందుకు పనికి రారు.

G. "నులి వెచ్చనగాయున్నావు గనుక నేను నిన్ను నా నోటనుండి ఉమ్మివేయ నుద్దేశించుచున్నానని" క్రీస్తు వారికి చెప్పెను.

అసహ్యముగా నున్న నులివెచ్చని జలధారల నీటిని నోటిలో వేసుకొని ప్రజలు ఉమ్మివేసేవారు. లవొదికయ క్రైస్తవులు ప్రభువుకు అసహ్యం కలుగ జేసారు. అందువలన ఆయన వారిని అసహ్యించుకొనుచున్నారు.

H. అయితే ఈ క్రైస్తవులు ఎందుకు నులి వెచ్చనగా యున్నారు? వారు తమలో తామే సంతృప్తిజెంది యున్నారు. "ధనవృద్ధి చేసికొనియున్నాను, నాకేమియు కొదువలేదని చెప్పుకొనుచున్నావు" (17వ). యిది వారి స్వంత అభిప్రాయమే. లూకా 12:19-20లో ధనవంతుడైన రైతు ఇట్లే తలంచాడు. "ఐహిక విచారములును, ధనమోసమును మరి ఇతరమైన అపేక్షలును లోపల చొచ్చి వాక్యమును అణచివేయుట వలన అది నిష్ఫలమగును" (మార్కు 4:19).

I. లవొదికయ సంఘమును గూర్చి యేసు యొక్క అంచనా గమనించుము. "నీవు దౌర్భాగ్యుడవును, దిక్కుమాలిన వాడవును, దరిద్రుడవును గ్రుడ్డి వాడవును, దిగంబరుడవునై యున్నావని యెరుగక" యున్నావు (17వ).

1. వారు దౌర్భాగ్యులు, దిక్కుమాలిన వారు, వారి స్థితి నిజంగా జాలి గొలిపే స్థితి.

2. వారు దరిద్రులు అనగా ఆత్మీయంగా దరిద్రులే.

3. వారు గ్రుడ్డివారు, దేవుని యెడల, యితరుల యెడల, తమ యెడల తమ బాధ్యతలను చూడలేనివారు.

4. దిగంబరులు, క్రైస్తవ లక్షణములు లేనివారు.

J. ఆత్మీయంగా వారు కడు దరిద్రులని ప్రభువు చెప్పారు. స్ముర్నలో యున్న సంఘము బీదవారుగాని ఆత్మీయం గా ధనవంతులు, లవొదికయవారు ఆర్థికంగా ధనవంతులు గాని ఆత్మీయంగా దరిద్రులు!

K. ఆ సంఘము దేవుని కొరకు ఉత్సాహాన్ని, ఆతురతను, చురుకు దనాన్ని కోల్పోయింది. అది బలిసిపోయి, సోమరియై, స్వనీతితో నిండుకొని యున్నది.

**III. క్రీస్తు యొక్క సలహా (18వ).**

A. ఆయన వారికొక ఆలోచన చెప్పెను. క్రీస్తు ఆలోచనకర్త (యెష 9:6). మనం ఆయన మాటలను వినాలి (మత్త 17:5).

B. వారు 'అగ్నిలో పుటము వేయబడిన బంగారమును' ఆయన యొద్ద కొనాలి. ఆయన సంపదలకు గని. ఆత్మీయ సంపదను ఆయన నుండి కొనాలి. అవి తుప్పుపట్టవు, దొంగిలింపబడవు (మత్త 6:19-21). లవొదికయ వారు సంపన్న సంఘము. ఆత్మీయంగా దరిద్రులు.

C. వారు 'తెల్లని వస్త్రములు' ఆయన నుండి కొనాలి. లవొదికయలో దుస్తుల తయారీ పరిశ్రమయుండేది. నల్లకాకి రంగులో యుండే ఉన్ని దుస్తులకు అది ప్రసిద్ధి. గొర్రెపిల్ల రక్తములో కడుగబడినవి తెల్లని వస్త్రములు (ప్రక 7:14). అవి క్రీస్తు వధువు ధరించే వస్త్రములు, ఆ వధువు నీతిని, నీతిక్రియలను ధరించును (ప్రక 19:6).

D. "నీకు దృష్టి కలుగునట్లు నీ కన్నులకు కాటుకను నా యొద్దకొనుమని నీకు బుద్ధి చెప్పుచున్నాను" అని ప్రభువు వారికి చెప్పెను. లవొదికయ కన్నుల కాటుకకు ప్రసిద్ధి. అయినను ఈ క్రైస్తవులు ఆత్మీయంగా గ్రుడ్డివారే. సాతానుడు క్రైస్తవులకు, క్రైస్తవేత రులకు గ్రుడ్డితనం కలుగజేస్తాడు (2 కొరింథీ 4:4; II పేతురు 1:9).

**IV. క్రీస్తువారికిచ్చే హెచ్చరిక (19వ)**

A. "నేను ప్రేమించువారినందరిని గద్దించి శిక్షించుచున్నాను". హెబ్రీ 12:6-8 దేవుడు తన కుమారులను గద్దించి, శిక్షించునని చెప్పుచున్నది. మనం బ్రదుకునట్లు ఆయన అట్లు చేస్తారు (హెబ్రీ 12:9). అది మన మేలుకొరకే (హెబ్రీ 12:10). ఈ మాటలను బట్టివారు అనందించాలి. వారింకా దేవుని బిడ్డలే, గనుక వారు ఆనక్తి కలిగి మారుమనస్సు పొందాలి.

**V. చివరిగా, క్రీస్తు రెండు వాగ్దానములు చేసారు (20,21వ).**

A. "ఇదిగో నేను తలుపునొద్ద నిలుచుండి తట్టుచున్నాను. ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో అతడును భోజనము చేయుదుము"

1. ఇక్కడ క్రీస్తు మనకు వెలుపల కనబడుచున్నారు. స్వీయ సంతృప్తి, నులి వెచ్చని స్థితి వలన ఆయన వెలుపల యున్నారు.
2. మన హృదయాల్లోకి పున:ప్రవేశము కొరకు ఆయన విజ్ఞాపన చేయుచున్నారు.
3. మనుష్యుడే తన హృదయ ద్వారాన్ని ఆయన కొరకు తెరవాలి. ఆయన బలవంతముగా ప్రవేశింపరు.

B. జయించువానిని "నాతో కూడ సింహాసనము నందు కూర్చుండనిచ్చెదనని" క్రీస్తు వాగ్దానము చేసారు (21వ).

క్రైస్తవులు క్రీస్తు యొక్క రాజరికాన్ని, శక్తిని, అధికారమును, ఘనతను పాలుపుచ్చుకొందురని దీని యర్థము.

**ముగింపు:** క్రీస్తుకు, ఆయన సంఘానికి మనం ప్రథమ స్థానం ఇవ్వాలి. లేదా మనకు ఏ స్థానం వుండదు (మత్త 6:33; II కొరింథీ 8:5). సిరిసంపదల యొక్క ప్రమాదాన్ని మనం గుర్తించాలి. వాటి వలన విశ్వాసము కోల్పోయే స్థితి తెచ్చుకోకూడదు (I తిమో 6:10). దేవుని ప్రజలు నులివెచ్చగా యుంటే దేవుడు వారిని అసహ్యించుకొంటారు. మనం ఆయన కొరకు ఆసక్తిగా యుండాలి. ఆయన నీ హృదయపు ద్వారము తట్టుచున్నారేమో? నీవు తలుపు తీయవా?

**– జాన్‌స్టేసీ**

# పరిశుద్ధాత్మ అనగా దేవుని ఆత్మ

**పరిచయము:** – పరిశుద్ధాత్మను గూర్చిన బోధ, ఆయన వ్యక్తిత్వము (Personality), ఆయన పని, దేవునితోను, మానవుని తోను, పరిశుద్ధాత్మ యొక్క సంబంధము దేవుని వాక్యము (బైబిలు) స్పష్టముగా బోధించుచున్నది.

బైబిలునందు మూడు యుగములు లేక శకములు కలవు. 1. పితరుల యుగము 2. మోషే యుగము 3. క్రీస్తు యుగము. దేవుడు మానవునితో వ్యవహరించుటకు అన్ని యుగముల యందును, ప్రతి సమయము నందును దేవుడు తన చిత్తమును, కార్యములను నెరవేర్చుకొనుటకును పరిశుద్ధాత్మను ఉపయోగించెను.

దేవుని నిత్యసంకల్పమును లోకమునకు బయలు పర్చుటకు పరిశుద్ధాత్మ ప్రవక్తల యందును, క్రీస్తునందును, అపొస్తలుల యందును నానా సమయములలో నానా విధములుగా పనిచేసెను. అంతే కాకుండా మార్పు చెందుచున్న పాపుల యందును ఆది సంఘము నందును వ్యక్తిగత క్రైస్తవుని యందును దైవ ఉద్దేశమును సాధించుటకు పనిచేసెను. మరియు ముఖ్యముగా క్రైస్తవులు (దేవుని కుమారులు) దైవ కుమారుడైన క్రీస్తు స్వరూపము (వ్యక్తిత్వము) లోనికి మార్చబడునట్లు పరిశుద్ధాత్మ వారిలో (క్రైస్తవులలో) నివాసము చేయుట అనునది దేవుని ముఖ్య ఉద్దేశమై యున్నది. "మన మందరమును ముసుగు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దము వలె ప్రతిఫలింప జేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడు చున్నాము" (2 కొరింథీ 3:18).

దేవుడు తన ముఖ్యోద్దేశము సాధించుటకు ఈ క్రైస్తవ శకము నందు పరిశుద్ధాత్మను విరామము లేకుండ వాడుకొనుచుండెను.

పరిశుద్ధాత్మ దేవత్వమునందు ఒకవ్యక్తి అనగా దేవుడు, క్రీస్తు, పరిశుద్ధాత్మలను లేఖనములు దేవత్వము అని పిలిచెను. "కాబట్టి మనము దేవుని సంతానమై యుండి మనుష్యుల చమత్కార కల్పనల వలన మల్చబడిన బంగారమునైనను,

వెండి నైనను, రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంపకూడదు (అపో.కా. 17:29).

ఆయన అదృశ్య లక్షణములు అనగా ఆయన నిత్యశక్తియు దైవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటబడుచున్నవి. గనుక వారు నిరుత్తరులై యున్నారు (రోమా 1:20). ఏలయనగా దేవత్వము యొుక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందున్నది (కొలస్స 2:9). దేవత్వము అను పదము బైబిలునందు వాడినట్లు దైవ లేఖనములను చూచితిమి. ఇంగ్లీషు బైబిలునందు దేవత్వము అను పదము Godhead (గాడ్‌హెడ్) అని ఉపయోగింపబడెను. గ్రీకు బైబిలు గ్రంధము నందు Theiotes (థియోడెస్) అను పదము వాడబడెను. ఈ పదమును ఇంగ్లీషులో Godhead (గాడ్‌హెడ్) అని అనువాదము చేయబడెను. శ్రీమంతుడగు దేవుని హితబోధకు వ్యతిరేకముగా మానవ కల్పిత సిద్ధాంతములు (బోధలు) బోధించరాదు (1 తిమోతి 1:10; రోమా 16:17; II తిమోతి 6:3; II తిమోతి 3:16).

**పరిశుద్ధాత్మ వ్యక్తిత్వమునకు ఋజువులు**

పరిశుద్ధాత్మ వ్యక్తియని మనము ఎట్లు గుర్తించగలము? ఉదా:- ఒకడు మాట్లాడుట, ఆలోచించుట, నడిపించుట, దు:ఖించుట, చెప్పుట మొదలగు పనులు చేయుట ద్వారా వ్యక్తి అని గుర్తించగలము. ఆలాగుననే పరిశుద్ధాత్మ ఒక వ్యక్తియని ఆయనను గూర్చిన లేఖనములను పరిశీలించెదము. పరిశుద్ధాత్మ దేవత్వము నందుగల ఒకవ్యక్తి ఈయన దైవ వ్యక్తి.

పరిశుద్ధాత్మ తండ్రియైన దేవుని వలెను, ప్రభువైన క్రీస్తువలెను మాట్లాడెను. ఆయన పనులు ఆయన వ్యక్తిత్వమును బయలుపర్చుచున్నవి. ఎట్లనగా "అయితే కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణవలన మోసపర్చు ఆత్మల యందును, దయ్యముల బోధయందును, లక్ష్యముంచి విశ్వాస భ్రష్టులగుదురని ఆత్మతేటగా చెప్పుచున్నాడు" (1 తిమో 4:1).

"తండ్రి యొద్దనుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆదరణ కర్త అనగా

తండ్రి యొద్దనుండి బయలుదేరు సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినపుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును" (యోహాను 15:20). "నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నియు జ్ఞాపకము చేయును" (యోహా 14:26). 1.ఆత్మ వచ్చినపుడు మిమ్మును సర్వసత్యములోనికి నడిపించును 2. సంభవింపబోవు సంగతులు తెలియజేయును (యోహా 16:12,15). ఆసియాలో వాక్యము చెప్పకూడదని పరిశుద్ధాత్మ వారి నాటంక పరచినందున వారు ఫ్రుగియ గలతియ ప్రదేశముల ద్వారా వెళ్ళిరి. ముసియ దగ్గరకు వచ్చి బెతూనియకు వెళ్ళుటకు ప్రయత్నము చేసిరి గాని యేసు యొక్క ఆత్మవారిని వెళ్ళనీయలేదు (అపొ.కా. 16.6-7). మనకైతే దేవుడు తన ఆత్మ వలన వాటిని బయలుపర్చి యున్నాడు. ఆ ఆత్మ దేవుని మర్మములను పరిశోధించుచున్నాడు. (1 కొరింధి 2:10).

**ఒక వ్యక్తికి గల గుణగణములు పరిశుద్ధాత్మకు గలవు**

1. ప్రార్ధన యందు సహాయము చేయును (రోమా 8:26)
2. విజ్ఞాపన చేయును.
3. మనస్సు ఎరుగును.
4. దేవుని సంగతులు తెలిసినవాడు. 1కొరింధి 2:11-13
5. నేర్పించువాడు
6. శక్తినిచ్చువాడు. రోమా 15:13
7. ఉపకారము చేయువాడు. నెహెమ్యా 9:20
8. దు:ఖ పడువాడు. ఎఫెస్సి 4:30
9. దు:ఖింప చేయబడెను. యెషయ 63:10

**పరిశుద్ధాత్మకు దైవత్వము యొక్క సహజ లక్షణములు గలవు.**

దేవుడు నిత్యుడు, సర్వశక్తి గలవాడు. ఆలాగుననే పరిశుద్ధాత్మ కూడ నిత్యుడు, సర్వశక్తి గలవాడు. నిత్యుడగు ఆత్మ (హెబ్రీ 9:14). దేవుని మర్మములను పరిశోధించగల సర్వశక్తి గలవాడు (1 కొరి 2:10-11; మీకా 3:8). నీ ఆత్మ యొద్దనుండి నేనెక్కడికి పోవుదును? ఆయన సర్వాంతర్యామి (కీర్తన 139:7). క్రొత్త జన్మయందు పరిశుద్ధాత్ముడు (యోహా 3:5). అద్భుతములు చేయుటకు పరిశుద్ధాత్ముడు మూల కారకుడు (మత్త 12:28).

పైన చెప్పబడిన కార్యములను బట్టి

పరిశుద్ధాత్మ వ్యక్తి యని గుర్తించితిమి. ఆదికాండము నుండి ప్రకటన గ్రంధము వరకు దేవుడు, క్రీస్తు పరిశుద్ధాత్మ అను ఈ దేవత్వము యొక్క పనులు వారి సంకల్ప విధానము వారి మాటలు వారి ఆశీర్వాదములు, సమాధాన కార్య క్రమములు వారి మహిమను మనము చూడగలము. పరిశుద్ధాత్మ ఒక వస్తువుగా గాక ఒక మహిమకరమైన దైవవ్యక్తిగా మనకు అర్ధమగును.

**పాతనిబంధనయందు పరిశుద్ధాత్మ**

పాతనిబంధన యందు పరిశుద్ధాత్మకు వేరువేరు నామములు (పేర్లు) గలవు. కొన్ని సమయాలలో పరిశుద్ధాత్మ దేవుని ఆత్మయనియు, యెహోవా ఆత్మయనియు, ప్రభువు ఆత్మయనియు పరిశుద్ధాత్మ అనియు పిలువబడెను. పాత నిబంధనయందు 88 వేర్వేరు లేఖనములయందు పరిశుద్ధాత్మను గూర్చి మనము చదువగలము. ఆయనకు 18 రకముల పేర్లు ఉపయోగించబడెను

పాత నిబంధన యందు దేవునికి పరిశుద్ధాత్మకు మధ్య ఒకేరకమైన ముంగుర్తులు కన్పించుచున్నవి (కీర్తనలు 139:7). నీ ఆత్మ యెద్దనుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? ఈ లేఖనములో పరిశుద్ధాత్మ దేవుని వలె సర్వాంతర్యామి అని అర్ధమిచ్చుచుండెను. వారు తిరుగుబాటు చేసి ఆయన పరిశుద్ధాత్మను దు:ఖింపజేయగా ఆయన వారికి విరోధి ఆయెను (యెష 63:10). దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను (ఆదికాండము 1:2). అపుడు యెహోవా ఆత్మ నరులతో ఎల్లపుడు వాదించదు (ఆది 6:3). నీ సన్నిధిలో నుండి నన్ను త్రోసివేయకుము నీ పరిశుద్ధాత్మను నా యొద్దనుండి తీసివేయకుము (కీర్త 51:11). వారికి బోధించుటకు నీ ఉపకారాత్మను దయచేసితివి (నెహెమ్యా 9:20). ఈ లేఖనములు దేవుని విశేషమైన ఉద్దేశమును సాధించుటలో మంచి దృక్పధము కలిగిన కార్యకారియగు పరిశుద్ధాత్మ దేవుడని ఋజువుచేయుచుండెను.

**-M. ఆల్‌ఫ్రెడ్, రామచంద్రపురం**

## సంక్షిప్త వార్తలు

2007 ఫిబ్రవరి మొదటి వారంలో రిక్కీ గూటం గారు అమృతసర్, చండీగడ్ ప్రాంతాలలో పర్యటించి సువార్తచాటిరి. ఫిబ్రవరి 2వ తేదీ శుక్రవారం అమృతసర్‌లో సోదరులు రూబిన్ మసీ గారితో కలసి అక్కడ యున్న సంఘమునకు వాక్యపరిచర్య చేసిరి. ఫిబ్రవరి 4వ తేదీ ఆదివారం రిక్కీగారు చండీగడ్‌లో యున్న స్థానిక సంఘములో వాక్యపరిచర్య చేసిరి. ఢిల్లీ నుండి ఆయనతో కూడ వెళ్లిన వినయ్ డేవిడ్ గారు హిందీ భాషలో రిక్కీ గారి ప్రసంగాలను తర్జుమా చేసిరి.

ఫిబ్రవరి 7,8,9 తేదీలలో జాషువా గూటం గారు సతీసమేతముగా చెన్నై వెళ్లి సత్యవాణి T.V. కార్యక్రమాల నిర్వహణ విషయమై గుడ్‌న్యూస్ టెలివిజన్ వారితో సమయమును గడిపిరి.

ఫిబ్రవరి 18 నుండి 27 వరకు అమెరికా నుండి వచ్చిన సోదరులు తిమోతి వైల్బ్ గారు, డేవిడ్ లెనార్డ్ గారు ఉభయ గోదావరి జిల్లాలలో జాషువా గూటం, రిక్కీ గూటం గార్లతో పర్యటించిరి.

ఫిబ్రవరి 18వ తేదీ ఆదివారం సాయంత్రం కత్తిపూడి మండలం మెరక చావరంలో యున్న క్రీస్తు సంఘముతో కలిసి పైనుదహరించిన సోదరులు ఆరాధనలో పాల్గొని, వాక్యపరిచర్యచేసిరి. అక్కడ ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. రౌతులపూడిలోను, మెరకు చావరం లోను సోదరులు ఎమ్ముల దేవుదాసు గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

ఫిబ్రవరి 19వ తేదీనాడు తిమోతి, డేవిడ్, రిక్కీగార్లు పాయకరావుపేట దేవవరంలో సువార్త పరిచర్యచేసిరి. అక్కడ సోదరులు గోగాడ యోహానుగారు పనిచేయుచున్నారు. ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

ఫిబ్రవరి 20వ తేదీ మంగళవారం ప్రత్తిపాడు మండలం యేలూరులో జాషువా గూటం గారి ఆధ్వర్యములో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయ ప్రతిష్ట కార్యక్రమము ఘనముగా జరిగినది. ఆలయ ప్రాంగణను సోదరులు జాషువా గూటం గారు రిబ్బను కత్తిరించి ప్రతిష్టించిరి. సోదరులు డేవిడ్ గారు వాక్యపరిచర్య చేసిరి. ఆలయమునకు 2006 నవంబరు 23న రిక్కీ గూటం గారు పునాది వేసిరి. సోదరులు విత్తనాల స్వామినాదన్, ఆయన కుమారుడు క్రాంతి కుమార్ గార్లు యేలూరు, పాత పెద్దాపురం మొదలగు గ్రామాలలో నమ్మకమైన పరిచర్య

చేస్తు సంఘములను ఆత్మీయముగా నడుపుచున్నారు. యేలూరు ఆలయ నిర్మాణములో అక్కడ స్థానిక సంఘము, స్వామినాదన్ గారు నిర్విరామ కృషి చేసిరి. హాజరైన వందలాది ప్రజలకు ఆనాడు మంచి విందు ఏర్పాటు చేసిరి.

ఫిబ్రవరి 21వ తేదీ బుధవారం కిర్లంపూడి మండలం పెద్దనాపల్లిలోను, 22వ తేదీ రాత్రికి కోటిపల్లి కోటలో జరిగిన కూటములలో రిక్కీ గూటం, డేవిడ్ లెనార్డ్, తిమోతి గార్లు వాక్య పరిచర్య చేసిరి. పెద్దనాపల్లిలో మోర్త దేవదాస్ గారును, కోటిపల్లి కోటలో యస్.సామ్యూల్ గార్లు సువార్త చాటుచున్నారు.

ఫిబ్రవరి 23వ తేదీ శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లా పెనుమంచిలిలోను, కరుగోరుమిల్లి, పెళ్లికూతురమ్మ చెరువులోను యున్న సంఘములను పైనుదహరించిన సోదరులు దర్శించి వాక్య పరిచర్య చేసిరి. పలువురు క్రీస్తులో ప్రవేశించిరి. ఆ ఏరియాలో యం.జోసఫ్ గారు, యన్.మోజస్ గార్లు సువార్త చాటుచున్నారు.

అమెరికా నుండి వచ్చిన సోదరులు ఫిబ్రవరి 24,25 తేదీలలో పొలమూరు, ఉండేశ్వరపురం గ్రామలలో వాక్యపరిచర్య చేసిరి. 27వ తేదీన బొంబాయి మీదగా స్వదేశమునకు తిరిగి వెళ్లిరి. పొలమూరులో K. జయానందం గారును, ఉండేశ్వరపురంలో G. జెకర్యా గారును సువార్త చాటుచున్నారు. పొలమూరులో ఇద్దరు, ఉండేశ్వరపురంలో 7 గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004

CMYK